# గురు పౌర్ణమి



బాహ్యముఖంగా పరుగెడుతున్న మన మనస్సును హృదయము వైపు అంతర్ముఖపరచి, మన స్వరూపమైన ఆత్మ వైపు గురి పెట్టించేవాడు గురువు. అందరికి ఒకే గురువు ఉండనక్కరలేదు. ఏ మహాత్ముని దర్శనము వలన మీ మనస్సు అంతర్ముఖమై ఆత్మశాంతిలో కూరుకుపోతుందో అతడే మీకు గురువు.

జన్మల తరబడి ఆత్మ కోసం మీరు తపన పడుతుంటే - మీ తపనే ఒక దేహము ధరించి ఈ భువిపై గురు రూపములో అవతరిస్తుంది. స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు మూడింటిని దహించేవాడే సద్గురువు!

వ్యాస మహర్షి పుట్టినరోజునే గురుపౌర్ణమిగా ఎందుకు జరుపుకుంటున్నామంటే - ఒక కుప్పగా ఉన్న వేద వాక్యాలను లోక కళ్యాణము కోసము నాలుగు వేదాలుగా విభజించి మనకు జ్ఞానభిక్ష పెట్టి జగద్గురువు అయ్యాడు వ్యాస మహర్షి. అందుకే ఆయన పుట్టిన పౌర్ణమిని వ్యాస పౌర్ణమి అని, గురు పౌర్ణమి అని అంటారు.

అజ్ఞానాంధకారములో కొట్టుకుపోతున్న నన్ను జాగృతి చేసి, జ్ఞాన జ్యోతిని నాలో వెలిగించి, నాకు సమతను, మమతను నేర్పిన నా సద్గురుదేవులు శ్రీ నాన్నగారికి నా హృదయ పూర్వక పాదాభివందనములు సమర్పించుకుంటున్నాను.

పురాణ పురుషుల పాదస్పర్శతో పునీతమైన పుడమి తల్లి, పుణ్య పురుషుల కన్నతల్లి మన తల్లి భారతి. అట్టి భరతమాత గర్భాన పవిత్ర గోదావరి తీరాన, సాగర సంగమ సమీపాన 1934 సెప్టెంబరు 23 ఆదివారము నాడు, నిండు పున్నమి రోజున పుణ్య దంపతులు జిన్నూరు గ్రామ వాసులు సూర్యనారాయణరాజు, రాజయ్యమ్మల ప్రథమ బిడ్డగా, వెంకట లక్ష్మీ నరసింహరాజు నామధేయముతో ఆధ్యాత్మిక ఆకాశాన ఒక పూర్ణ చంద్రుడు ఉదయించాడు.

పువ్వు పుట్టగానే పరిమళించినట్లు చిరు ప్రాయము నందే ఆధ్యాత్మిక చింతనతో ఆ బాలుడు దిన దిన ప్రవర్ధమానుడయ్యాడు. పుణ్య తీర్థాలు సందర్శించాడు. పునీతుల దీవెనలు అందుకున్నాడు.

అరుణాచల ఋషిగా వినుతి కెక్కిన భగవాన్ శ్రీ రమణ మహర్షి 1957లో ఆ బాలునికి స్వప్నములో దర్శనమిచ్చి ఎత్తుకొని, హృదయానికి హత్తుకొని, ముద్దాడి ఆశీర్వదించారు. అంతే 1983లో ఆ మొగ్గ పువ్వుగా మారి గోదావరి ప్రాంతమంతా రమణ తత్వ పరిమళంతో గుప్పుమంది. ఆ గుబాళింపు దేశ విదేశాలు వ్యాప్తి చెందింది. వారే జిన్నూరు శ్రీ నాన్నగారు! భక్తులు కొలిచే పెన్నిధి, దీనుల పాలిట కల్పతరువు.



కొందరు అంటూ ఉంటారు, "ఆయన సద్గురువునని ప్రకటించుకున్నారా?" అని! వేరుభావన ఉన్నవాడు ప్రకటించుకుంటాడు. మరి ప్రకటించుకొనే వాడే లోపల లేనప్పుడు ఎవరు ప్రకటించుకుంటారు - ఎవరికి ప్రకటించుకుంటారు? ప్రకటించుకొనేవాడు అసలు గురువు శబ్దానికి అర్హుడా? మంత్రం చెప్పినంత మాత్రాన, మహిమలు చేసినంత మాత్రాన ప్రతీవాడు గురువు అవుతాడా? కాదు! ఆత్మద్రష్ట ఒక్కడే గురువు! తన చూపు చేతనో, మాట చేతనో, స్పర్శ చేతనో మనస్సును హృదయములోనున్న ఆత్మ వైపునకు అంతర్ముఖ పరచగలవాడే గురువు శబ్దానికి అర్హుడు.

మన మానసిక స్థాయికి దిగి వచ్చి ఆర్తులకు సత్యాన్ని విప్పి చెపుతూ, చేతికి పట్టి చూపుతూ, తన శాంతితో ఎందరి హృదయాలలోనో కాంతిని నింపుతూ, చూపులతోనే ఎందరి కన్నీళ్లనో తుడుస్తూ, అజ్ఞాన తిమిరంలో అలమటిస్తున్న అభాగ్యుల జీవితాలలో జ్ఞాన దీపాలను వెలిగిస్తూ, గృహస్థుగా జీవిస్తూ తన జీవితాన్నే ఒక సందేశముగా చూపిస్తూ - మాటలతోనో, మౌనంతోనో, చూపులతోనో, స్పర్శతోనో తనను దర్శింప వచ్చిన వారిని హృదయపు లోతుల లోనికి పయనింప చేసిన పరమ పవిత్రుడు, జ్ఞాన స్వరూపుడు శ్రీ నాన్నగారు.

"మీ ఇంటికి వస్తే ఏమిస్తారు? - మా ఇంటికి వస్తే ఏమి తెస్తారు?" ఇదీ నేటి సమాజ దుస్థితి! ఇటువంటి రోజులలో - "నా మాటలను సక్రమంగా అర్థం చేసుకోండి, అర్థం చేసుకోవడం కూడా ఒక యోగమే, అదే మీరు నన్ను గౌరవించడం! మీ దండల్ని గానీ, దండాలను గానీ, ధనాన్ని గానీ నేను ఆశించుట లేదు. మీరు తిన్న అన్నం జీర్ణం చేసుకుంటే మీ ఒంటికి బలం, నా మాటల్ని అర్థం చేసుకుంటే మీ మనస్సుకు బలం. అవి మీ స్వరూపాన్ని తెలుసుకోవటానికి సహకరిస్తాయి. నన్ను మీరు తెలుసుకుంటే మీరు సుఖపడరు. మిమ్మల్ని మీరు తెలుసుకుంటే

మీరు సుఖపడతారు" అని శ్రీ నాన్నగారిలా చెప్పే నిస్వార్థ గురువులు ఎందరుంటారు?

వేషభాషలతో సమాజాన్ని మోసపుచ్చి దోచుకునే నేటి రోజులలో "విషయం మీ బుద్ధికి అర్థం అయ్యేలా చెప్పలేకపోతే ఆ దోషం నాది కానీ - మీది కాదు. నాలో పవిత్రత ఉంటే మీరు మరచిపోవాలనుకున్నా నా మాటలు మిమ్ములను వెన్నంటి తరుముతాయి. నేను స్మరించినంత మాత్రము చేతనే మీకు శాంతి కలుగకపోతే - నాలో శాంతి లేనట్లే - నాలో పవిత్రత లేనట్లే. నన్ను చూడగానే మీ మనస్సు ఆత్మ వైపుకి తిరగకపోతే ఆ లోపం నాది గానీ - మీది కాదు" అని శ్రీ నాన్నగారిలా చెప్పే సాహసమున్న గురువులు ఎందరున్నారు?.




విప్లవాల పేరుతో, ఇజాల పేరుతో సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న నేటి తరానికి "ఏది విప్లవం? కర్రలు పెట్టి కొట్టుకుంటే, కత్తులు పెట్టి కుత్తుకలు కోసుకుంటే, తుపాకులు పెట్టి కాల్చుకుంటే, బాంబులు పెట్టి పేల్చుకుంటే, వీధులలో లూటీలు చేస్తే - అది విప్లవమనో ఏదో అంటున్నారు. కాని అది విప్లవం కాదు. మీ మనస్సును మీరు సంస్కరించుకుంటే అదే నిజమైన విప్లవం! అంతకు మించిన విప్లవం లేనే లేదు" అని విప్లవానికే ఒక నూతన భాష్యం చెప్పారు శ్రీ నాన్నగారు.

గుడ్డలు మార్చుకొని అడవులకు వెళ్లమనో, అన్నపానాలు మానుకోమనో, సంసారాలను విడిచి పెట్టమనో శ్రీ నాన్నగారు బోధించుట లేదు! ఆత్మ కోసం, సత్యం కోసం, స్వరూప సుఖాన్ని పొందడం కోసం - మన మనస్సుల్ని శుద్ధిగా ఉంచుకోమని, హితమైనదే మితముగా తినమని, మిత నిద్ర, మిత భాషణ అలవరచుకోమని మన మేలు కోరి చెపుతున్నారు శ్రీ నాన్నగారు.

2017 డిశంబరు 29వ తేదీ మధ్యాహ్నం 12.00 గంటలకు శ్రీ నాన్నగారి దేహగతమైన చరిత్ర ముగిసిపోయింది.

వారు బోధించే అమృత వాక్కులు ఒక దేశానికో, మతానికో, కులానికో పరిమితం కాదు. "భగవంతుడు మనకి బుద్ధిని ప్రసాదించాడు. ఎందుకు? ఆలోచించమని! మీ బుద్ధికి పదును పెట్టండి! మీ వివేకాన్ని పెంచుకోండి! మీ స్వరూపాన్ని సందర్శించండి! స్వరూపాన్ని సందర్శించని జన్మ వ్యర్థం!



మనమందరం ఊహ తెలిసినది మొదలు "నేను నేను" అని అంటున్నాము. ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రించే వరకు ఈ "నేను" మనల్ని పిశాచంలా పట్టి పీడిస్తున్నది, దాని ఇష్టం వచ్చినట్లు ఆడిస్తున్నది, కాని ఈ "నేను" ఎవరో, దాని మూలం ఏమిటో తెలిసేవరకు ఏ జీవుడికి సుఖం లేదు, శాంతి లేదు, చావు పుట్టుకలు తప్పవు. మరి ఈ నేనుకు మూలం ఎక్కడ?

ప్రతీ మనిషి "నేను, నేను" అని తన గుండెల మీద కుడివైపున క్రింది భాగములో చేయి వేసి చూపిస్తుంటాడు. అంటే ఆ నేనుకు మూలము అక్కడనే ఉంది - అదే ఆధ్యాత్మిక హృదయము.

ఆ హృదయములో బ్రహ్మము నిరంతరము "నేను, నేను" అని స్వయముగా ప్రకాశిస్తున్నది. అదే నిత్యమైన, సత్యమైన, ఆత్మగతమైన "అసలు నేను". నీటిలో నుంచి బుడగ వచ్చినట్లు - ఆత్మ గతమైన ఈ అసలు నేనులో నుంచే దేహపరిమితమైన మిథ్యా నేను ఒకటి పుట్టుచున్నది. దీనినే చిజ్జడగ్రంథి అని, అహంకారమని, జీవుడని, కారణ శరీరమని అంటారు.

ఈ "నేను" నిజము కాదు - అది కేవలము ఒక తలంపు మాత్రమే! మనకు వచ్చు తలంపులలో - ఈ "నేను" అనునది ప్రథమ తలంపు. ఈ "నేను" అను తలంపును ఆధారముగా చేసుకొనే మనకు మిగిలిన అన్ని తలంపులు వచ్చుచున్నవి. ఆ తలంపుల మూటే - మనస్సు!



మనమందరము మనస్సు కల్పించినదే నిజమనుకొని ఎవడికి వాడు తన మనస్సు అనే చుట్టు గుడిశలోనే కాపురముంటున్నాడు. ఈ గుడిశకు "నేను" అనే అహంకారమే ఆధారము. ఈ "నేను" అను ఒంటి స్థంభము మీదనే మనస్సు అనే గుడిశ నిలబడి ఉంది. ఆ నిట్రాడ కూలిపోతే - గుడిశ కూలిపోతుంది. మనము నిజంగా సుఖపడాలని అనుకుంటే - ముందు ఆ "నేను"ను కూల్చాలి - అప్పుడు మనస్సు దానంతట అదే కూలిపోతుంది. మనస్సును మింగిన వాడు యోగి - లొంగిన వాడు భోగి.

గాఢ నిద్రలో ఈ "నేను" లేదు. అప్పుడు ఈ గొడవలు ఏమీ లేవు. చివరకు దేహం లేదు. లోకం లేదు. దేవుడు కూడా లేడు. కానీ మనము మాత్రం సుఖముగా ఉన్నాము. సుఖముగా ఉన్నామే గానీ సుఖముగా ఉన్న సంగతి నిద్రలో ఉండగా మనకు తెలియుట లేదు. మెలుకువ వచ్చాక మాత్రమే సుఖముగా ఉన్నామని చెపుతున్నాము. నిద్ర నుంచి మేల్కొన్న వెంటనే మరల ఈ "నేను" అను తలంపు పుడుతున్నది. దాని వెనకాలే సైన్యం వచ్చినట్లు, మన గొడవలన్నీ గుర్తుకు వస్తున్నాయి - అశాంతిని తెస్తున్నాయి. మెలుకువలో మనము ఉన్నామని తెలుస్తున్నది. కాని మనము సుఖముగా లేము. గాఢనిద్రలో ఉన్న సుఖాన్ని - మెలకువలో నున్న ఎరుకను ఏకకాలంలో అనుభవంలోకి తెచ్చుకోగలిగితే అదే మోక్షం!

మనము అందరము మోక్షం కావాలని కోరుకుంటున్నాము. కాని మనము మోక్షాన్ని కోరుకునేటప్పుడు కూడా మనము మోక్షములోనే ఉన్నాము. అయితే అది మన అనుభవములోనికి రాకుండా మన దేహపరిమితమైన "మిథ్యా నేనే" అడ్డుపడుతున్నది. మరి మన అన్ని అనర్థాలకు మూలమైన ఈ "నేను" ఎవరు?

మనల్ని ప్రకృతి ప్రలోభములకు బలిచేస్తున్న ఈ నేనే అసలు దొంగ! ఈ మిథ్యా నేనును దాని మూలములోనికి పంపించడానికి భగవాన్ శ్రీ రమణ మహర్షి "నేను ఎవడను?" అనే విచారణ పద్ధతిని బోధించారు. విజృంభిస్తున్న "మనస్సు" అనే మదపుటేనుగునకు "నేనెవడను?" అను ప్రశ్న అంకుశము వంటిది. ఈ "నేను"ను బోనులో నిలబెట్టి "నీవెవడవు" అని నిలదీస్తే - అప్పటివరకు బాహ్య సుఖాల కోసం పరుగులు తీస్తున్న మన నేను ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరై తలక్రిందులౌతుంది. అప్పుడు తన మూలాన్ని శోధించడం మొదలు పెడుతుంది. హృదయములోనికి ప్రయాణం చేస్తుంది. హృదయములో ఏముంది? ఆత్మ ఉంది. అప్పటివరకు బాహ్య సుఖాలను మరిగిన మన మనస్సు - ఆత్మ సుఖాన్ని ఒక్కసారి ఎప్పుడైతే రుచి చూసిందో - తేనెలో పడ్డ ఈగలాగ ఇక బయటకి రమ్మంటే రాదు. "నేను"ను మనము హృదయ స్థానమందు నిలకడగా నిలిపి ఉంచగలిగితే మన మనస్సులో నున్న కోరికలు విజృంభించుటకు ఆధారము లేక అవకాశము చిక్కక, మనస్సులోని కోరికలు

పలుచబడి అన్నీ రాలిపోతాయి. కోరికలు రాలిపోయిన మనస్సు ఆత్మాకారము చెందుతుంది. ఆత్మ తానుగా వ్యక్తమౌతుంది.

.

మనము దేవుడిని తెలుసుకోవాలి అనుకుంటే ఆయన తెలియబడడు. మీరు చేసే సాధన నిజమైతే ఆయనే దేహము ధరించి సద్గురు రూపములో ఈ భూమి మీద అవతరిస్తాడు - మిమ్మల్ని తరింపచేయటానికి గురుకృప లేకుండా ఏ జీవుడు జ్ఞాని కాలేడు. మిమ్మల్ని మీరు మింగలేరు - కానీ మిమ్మల్ని మింగే శక్తి మీ గురువుకు ఉంది. కాని మీకు మీరే అడ్డుగా ఉన్నారు. దేహము తానని మనిషి ఎంత సహజముగా అనుకుంటున్నాడో - అంతే సహజంగా తాను ఆత్మనని ఏ జన్మలో తెలుసుకుంటాడో అదే వాడికి కడసారి జన్మ.

చివరి మాటగా శ్రీ నాన్నగారు చెప్పేది “మీకు శక్తి ఉంటే సాధన చేసి తరించండి - సాధన చేసే ఓపిక లేకపోతే కనీసం ఒక సత్పురుషునితో సహవాసము చేయండి. సమస్త సద్గుణాలు మీకు సమకూరతాయి - సంసార సాగరాన్ని దాటిపోతారు” అంటున్నారు.

సత్యాన్ని రియలైజ్ చేయుట కోసం ఎందరో మహాత్ములు ఎన్నెన్నో మార్గాలు చెప్పారు. మీకు నచ్చిన మార్గాన్ని మీరు ఎంచుకుని మీ పద్ధతిలో మీరు ప్రయాణము చేయండి. మిమ్మల్ని మీరు సంస్కరించుకుని, మీరు ఎవరో మీరు తెలుసుకోండి. మీ జన్మలను జ్ఞానముతో పండించుకోండి. మీరు దుఃఖములో నుంచి బయట పడండి. మీరు శాంతిగా ఉండండి, మీ శాంతిని తోటి వారికి పంచి పెట్టండి!



డాక్టరు శ్రీ K.రామారావు గారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు 534265